# ప్రజలకు జీఎస్టీ ప్రయోజనాలు ఎంతైనా ప్రయోజనకరం

## ఆర్టీవో మురళీధర్



కావలి, అక్టోబరు 18, వుదయం న్యూస్:కూటమి ప్రభుత్వం జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు అందించడం ఎంతైనా ప్రయోజనకరమని ఈ అవకాశాన్ని ప్రజలు విరివిగా సద్వినియోగం చేసుకుంటారని కావలి ఆర్టీవో మురళీధర్ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా, కావలి లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం కావలి రవాణా శాఖ ఆధ్వర్యంలో ముసునూరులోనే స్వరాజ్ షోరూమ్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాల కొనుగోలు పై జీఎస్టీ తగ్గింపు విధానాన్ని లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా స్వరాజ్ షోరూమ్ దగ్గర నుంచి ఐకాన్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్టీవో మురళీధర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కావలి పట్టణంలోనే బజాజ్, హీరో, హోండా, స్వరాజ్ ట్రాక్టర్స్ షోరూమ్ లలో ఏర్పాటుచేసిన జీఎస్టీ స్టాల్స్ ను కావలి ఆర్టీవో మురళీధర్, మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సుందర్ రావు, జెసిటి ఓ జ్యోతి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాయ్ లు శనివారం తనిఖీ చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ ధరల ప్రకారం వెహికల్స్ అమ్ముతున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన లక్కీ డ్రా లు ప్రారంభించి వాహనదారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సుందర్ రావు, బిజెపి పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం, జెసిపిఓ జ్యోతి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ తదితర అధికారులు, ఆయా షోర్ రూమ్ ల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

# కనిపెట్టే శాఖలో.. కనిపించని దొంగలు!

రాష్ట్ర పన్నుల శాఖ గవర్నర్‌పేట సీటీవో కార్యాలయంలో అటెండర్ స్థాయి ఉద్యోగి కొండపల్లి శ్రీనివాస్.. పాతబస్తీలోని అవని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో ఓ వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికాడు. వాస్తవంగా అటెండర్ కావడంతో సీటీవో కార్యాలయం దాటి ఇతను రావడానికి వీల్లేదు. అలాంటిది.. బయటకొచ్చి వ్యాపారులను బెదిరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదంతా చూస్తే.. వాణిజ్య పన్నుల శాఖ అధికారుల పర్యవేక్షణ ఏంటో తెలుస్తోంది. ఇలా వ్యవహారాలు చేసే కిందిస్థాయి సిబ్బందికి కొందరు అధికారుల అండ ఉండటంతోనే బరితెగిస్తున్నారు. నగరంలోకి భారీగా పన్ను చెల్లించని సరకు వస్తోంది. రైళ్లు, లారీల్లో ఎలా వస్తుందో చాలామంది సిబ్బందికి తెలుసు. సరకొచ్చే వేళకు వాలిపోయి డబ్బులు దండుకుని వెళ్లిపోవడంతో ఖజానాకు భారీగా గండి పడుతోంది.విజయవాడ రాష్ట్ర పన్నుల శాఖ డివిజన్ 01, 02, 03 పరిధిలో 18 సీటీవో కార్యాలయాలు ఉన్నాయి. ఏ కార్యాలయం నుంచి సీటీవో స్థాయి అధికారి అయినా.. వ్యాపార సంస్థలు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో తనిఖీలకు వెళ్లాలంటే.. ఆయా డివిజన్ల ఉన్నతాధికారులైన సంయుక్త కమిషనర్ల (జేసీ) అనుమతి తప్పనిసరి. అలాంటిది.. ఓ అటెండర్ విచ్చలవిడిగా వెళ్లి వసూళ్లు చేస్తున్నాడు. కొండపల్లి శ్రీనివాస్ గతంలోనూ ఇలా వసూళ్లకు పాల్పడుతూ దొరకడంతో సస్పెండ్ చేశారు. మరోసారి శాఖాపర చర్యల్లో.. విజయవాడ నుంచి ఉయ్యూరుకు బదిలీ చేశారు. అయినా తీరు మారలేదు. ఓ ఉన్నతాధికారి అండతోనే పేట్రేగుతున్నాడు.ఆదాయానికి భారీగా గండి..శ్రీనివాస్ సహా మరికొందరు కిందిస్థాయి సిబ్బంది.. వ్యాపారులను బెదిరిస్తూ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు. వీరిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక చెలరేగుతున్నారు. ఇలాంటి ఘటనల వేళ అధికారులు.. సిబ్బంది ఎవరూ తమ అనుమతి లేకుండా బయటకెళ్లవద్దని హెచ్చరిస్తూ.. తర్వాత మళ్లీ వదిలేస్తున్నారు. శ్రీనివాస్‌ను ఉయ్యూరుకు బదిలీ చేసినవేళ.. విజయవాడలో వ్యవహారాలు చక్కబెడుతూ దొరికాడు. వన్‌టౌన్‌లో వాహనాలను ఆపి.. వసూళ్లకు పాల్పడుతూ దొరికగా కమిషనర్ సస్పెండ్ చేశారు. కానీ.. పైస్థాయిలో చక్రం తిప్పి.. పది నెలల్లోనే క్లీన్‌చిట్ తెచ్చుకుని.. మళ్లీ ఉద్యోగంలో చేరాడు.లగ్జరీ కార్లు, విదేశాలు.. డివిజన్ 02లోని అధికారులు చాలామందికి ఇతని వ్యవహారాలు తెలిసినా పట్టించుకోరు. ఇప్పుడు దొరికాక.. హడావుడి చేస్తున్నారు. ఇతను ఏటా విదేశీ పర్యటనలకు వెళ్తాడు. సంయుక్త కమిషనర్లే అనుమతిస్తున్నారు. విజయవాడలో ప్రముఖులు వాడే లగ్జరీ కార్లలో తిరుగుతుంటాడని తెలుస్తోంది. అయినా అధికారులు నిఘా పెట్టలేదు. తాజాగా వ్యాపారులను డబ్బుల కోసం వేధిస్తుండగా.. వాళ్లే ఏసీబీకి పట్టించారు.

# పండుగ వాతావరణంలో ధాన్యం సేకరణ

## ♦ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో అధికారులకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచనలు

## ♦ విజయవాడ అక్టోబర్ 18 వుదయం బ్యూరో




రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. విజయవాడలోని హోటల్ వివాంతలో శనివారం మంత్రి అధ్యక్షతన అధికారులకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌ను ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్, సివిల్ సప్లై డిపార్ట్మెంట్ సంయుక్తంగా నిర్వహించారు.

మంత్రి మాట్లాడుతూ, గత ఏడాది ధాన్యం కొనుగోలు సమయంలో క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను ఈ ఏడాది ముందస్తు ప్రణాళికలతో పరిష్కరించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గన్ని బ్యాగులు, లేబర్, ట్రాన్స్‌పోర్ట్ వంటి సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గన్ని బ్యాగ్స్ సరఫరాలో దళారులను అరికట్టడానికి జాయింట్ కలెక్టర్లు చొరవ తీసుకోవాలని, దీనికి సంబంధించి జిల్లా పోలీసు శాఖ నుంచి ప్రత్యేక ఎస్ ఓ పి విడుదల చేస్తామని తెలిపారు.పిడిఎస్ బియ్యం రీసైక్లింగ్‌కు వ్యతిరేకంగా రైస్ మిల్లర్లు ఇచ్చిన హామీని అమలు చేయాలని అధికారులను మంత్రి తెలిపారు.. ఈ అంశాన్ని అగ్రిమెంట్లలో స్పష్టంగా పొందుపరచాలని ఆదేశించారు. ఎఫ్ సి ఐ కు 60 రోజుల్లో బియ్యం సరఫరా చేసే రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియను రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పర్యవేక్షిస్తామని, ప్రతి అంశం డాష్‌బోర్డులో అందుబాటులో ఉంటుందని చెప్పారు. పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన అధికారులు పిలుపునిచ్చారు.గత ఏడాది అకాల వర్షాల కారణంగా 30,000 టార్పాలను పంపిణీ చేసినట్లు గుర్తు చేస్తూ, ఈసారి కూడా అవసరాన్ని బట్టి ముందస్తుగా టార్పాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో రైతులు ధాన్యం విక్రయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం "ఫార్మర్ ఫ్రెండ్లీ" విధానాల ద్వారా రైతులకు స్వేచ్ఛను కల్పించిందని అన్నారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు, నచ్చిన సమయంలో ధాన్యం విక్రయించుకునే అవకాశం కల్పించామని చెప్పారు.రైతులు సులభంగా వాట్సాప్‌లో "హాయ్ " పంపడం ద్వారా ధాన్యం విక్రయ ప్రక్రియలో చేరే సౌకర్యాన్ని కల్పించామని, విక్రయించిన 24 నుండి 48 గంటలలోపే రైతు ఖాతాల్లో నగదు జమ చేసిన విషయాలను గుర్తు చేశారు.ఈ వర్క్‌షాప్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ , సివిల్ సప్లై కార్పొరేషన్ ఎండి %డ% ఎఫ్ సి ఐ ఢిల్లీ రావు వ్యవసాయ శాఖ ఎండి మంజీర్ జిలాని, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్. గోవిందరావు, ఎఫ్ సి ఐ జి ఎం విజయ్ కుమార్ యాదవ్, ఆర్ టి జి ఎస్ సీఈఓ ప్రసంగించారు.కార్యక్రమంలో రాష్ట్రంలోని 26 జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై డి ఎం లు, డి ఎస్ ఓ లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణంధ్ర ను పురస్కరించుకుకొని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి కార్యాలయములో పరిసరాలను శుభ్రపరచినారు.



కర్నూలు అక్టోబర్ 18 వుదయం న్యూస్ బ్యూరో: అనంతరం జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్.భాస్కర్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఆరోగ్యంగా జీవించాలంటే వాయు కాలుష్యం లేకుండా ఉండడము చాలా ముఖ్యము, ఎ%శీ%దుకంటే మనం జీవించాలంటే ఆక్సిజన్ అవసరం ,అధిక కాలుష్యం వలన గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గితే మనిషి మనుగడకే ప్రమాదం, మనం జరుపుకొనే ఈ దీపావళి పండగ సందర్భంగా కాల్చే బాణసంచా లో కూడా అధిక శాతం విష వాయువులేనని రసాయనాలు,వివిధ మూలకాలు మనుషులు,ఇతర జీవులపై విష ప్రభావం చూపుతాయని తెలిపారు.వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని,వాతావరణ కాలుష్యనికి హానికరమైన ప్లాస్టిక్ ని వాడకుండా మన ఆరోగ్యాలు మనవే కాపాడుకోవాలని తెలిపారు. మాస్ మీడియా అధికారి ప్రకాష్ రాజు కార్యాలయ సిబ్బంది,అధికారులతో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణంధ్ర ను పురస్కరించుకుకొని ప్రతిజ్ఞ చేయించినారు.ఈ కార్యక్రమములో జిల్లా వ్యాధినిరోధకటీకాల అధికారిని డాక్టర్.ఉమా,డాక్టర్.కార్యాలయ పరిపాలన అధికారి అరుణ ,నాగప్రసాద్,సంచార చికిత్స కార్యక్రమ అధికారి డాక్టర్.రఘు,బాలస్వాస్థ్య అధికారి డాక్టర్.మహేశ్వర ప్రసాద్, ఆరోగ్య విస్తరణ మరియు విద్యాధికారి బాబా ఫక్రుద్దీన్ ,డెప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి ,కార్యాలయ సిబ్బంది. మరియు ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

# కోటి సంతకాలతో కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దాం.

## ♦ నగర వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు అహ్మద్ అలీ ఖాన్



కర్నూలు అక్టోబర్ 18 వుదయం న్యూస్ బ్యూరో :ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణతో కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని వైయస్సార్సీపి నగర అధ్యక్షులు అహ్మద్ అలీఖాన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్లో నగర అధ్యక్షులు అహమ్మద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ రాష్ట్రవ్యాప్తంగా ప్రజల మద్దతు అనూహ్యంగా పెరుగుతుందన్నారు. మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరిస్తే పేద,మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పిపిపి విధానంతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం పై ఆయన మండిపడ్డారు. గత వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద విద్యార్థులు కూడా డాక్టర్లుగా ఎదగాలనే కలను నెరవేర్చేందుకు 17 నూతనమైన మెడికల్ కళాశాలలను 17 నిర్మించిందని పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు ఇస్తూ పేదల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుందని అయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా పార్టీ ప్రజా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రైవేటు సంస్థలకు అప్పగించిన మెడికల్ కళాశాలలను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చి పేదలకు విద్యా, వైద్య విద్యార్థుల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ జుబేర్ అహమ్మద్, వైయస్సార్సీపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు అబ్రార్, రియాజ్ బాబా, అశోక్ బాబు, సుచరిత, నజీర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య నేతను పరామర్శించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



కావలి, అక్టోబరు 18, వుదయం న్యూస్:ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు బచ్చు వీరాస్వామినీ కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ఒక యాక్సిడెంట్ లో ఆయన గాయపడి, వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి కావలి పట్టణం బృందావనం లోని వారి నివాసానికి చేరుకొని ఆయనను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటిస్తూ, త్వరగా కోలుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు నేతలు ఉన్నారు

# కావలి ఆర్టీసీ డిపోలో హైర్ బస్ డ్రైవర్ల మెరుపు సమ్మె



కావలి, అక్టోబరు 18, వుదయం న్యూస్:కావలి ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆన్ కాల్ బస్ డ్రైవర్లు విధులు బహిష్కరించి మెరుపు సమ్మెకు శనివారం దిగారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్ కాల్ డ్రైవర్లగా తీసుకోలేదని, జీతాలు పెంచాలని నిరసన తెలిపారు. విధులు నిర్వహించడం ఆపివేసి బస్ డ్రైవర్లు ధర్నాకు దిగారు. కావలి డిపోకు చెందినదాదాపు 40 బస్సులు ఆగిపోవడంతో ప్రజా రవాణా స్థంభించి, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఓ పక్క ప్రయాణికుల ఆందోళన, మరో పక్క డ్రైవర్స్ నిరసనలతో ప్రాంగణం తలపించింది. ఈ ధర్నాకు సిఐటియు నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పసుపులేటి పెంచలయ్య ప్రత్యక్షంగా పాల్గొని డ్రైవర్స్ ఆందోళనకు మద్దతు ప్రకటించారు. అద్దె బస్సుల డ్రైవర్ల జీతాలను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు.

# రూ.15 కోట్లతో త్వరలోనే నిడదవోలులో అద్భుతమైన రోడ్ల నిర్మాణం

♦ మంత్రి కందుల దుర్గేష్

♦ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.70 కోట్ల నాబార్డు నిధుల సాయంతో జాతీయ రహదారి 16 నుండి కొత్తపల్లి అగ్రహారం మీదుగా కాపవరం పోవు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి కందుల దుర్గేష్

♦ నిడదవోలు నియోజకవర్గంలో రూ.7.34 కోట్లతో 4 రహదారుల నిర్మాణాలకు ప్రభుత్వానికి పెట్టిన ప్రతిపాదనలకు అనుమతులు లభించడం సంతోషంగా ఉందన్న మంత్రి దుర్గేష్.. ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం, ఆర్ అండ్ బీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి దుర్గేష్



నిడదవోలు అక్టోబర్ 18 వుదయం న్యూస్‌రూ.15 కోట్లతో త్వరలోనే నిడదవోలులో అద్భుతమైన రోడ్ల నిర్మాణం చేపట్టి వాహనదారులకు కష్టాల నుండి విముక్తి కలిగిస్తామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.70 కోట్ల నాబార్డు నిధుల సాయంతో జాతీయ రహదారి 16 నుండి కొత్తపల్లి అగ్రహారం మీదుగా కాపవరం పోవు రహదారి నిర్మాణానికి మంత్రి కందుల దుర్గేష్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గంలో రూ.8 కోట్లతో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందని అదే విధంగా మరో 7.34 కోట్ల నాబార్డు నిధుల సాయంతో కొత్త రోడ్ల నిర్మాణాలు చేపడుతామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రోడ్లు బాగుంటేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని విశ్వసించి ప్రస్తుతం శంకుస్థాపన చేసిన రహదారితో పాటు రూ.1.50 కోట్లతో కానూరు నుండి నడిపల్లి కోట, రూ.1.45 కోట్లతో సింగవరం నుండి నందమూరు, తాళ్లపాలెం మీదుగా నిడదవోలు మండలం వరకు, రూ.2.69 కోట్లతో ఉండ్రాజవరం మండలంలోని పైడిపర్రు నుండి సత్యవాడకు వెళ్లే రహదారుల నిర్మాణం చేపట్టాలని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆర్ అండ్ బి మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డిని కలిసి ప్రతిపాదనలు పెట్టానని ఈ మేరకు ఈ రోడ్లకు అనుమతులు మంజూరు కావడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. మూడు గ్రామాలను కలిపే ఈ రోడ్డును త్వరలోనే అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. తాను ప్రతిపాదనలు పెట్టిన 4 రహదారులకు ఇప్పటికే అగ్రిమెంట్లు పూర్తయ్యాయని, పరిపాలన అనుమతులతో పాటు ఆర్థిక అనుమతులు లభించాయని, కాంట్రాక్టర్లను లిస్ట్ చేశామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ 4 రోడ్లను త్వరితగతిన ప్రారంభించుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ నాబార్డు, రిజర్వ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు సమీకరించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు.

నిడదవోలు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వానికి సైతం అనేక ప్రతిపాదనలు పెట్టానని మంత్రి దుర్గేష్ అన్నారు.నియోజకవర్గంలో నాడు ఎమ్మెల్యేగా ఉన్న బూరుగుపల్లి శేషారావు వేసిన రోడ్లే ఇప్పటికీ ఉన్నాయని, గడిచిన ఐదేళ్లలో ఎలాంటి రోడ్లను చేపట్టలేదని మంత్రి దుర్గేష్ అన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వ హయాంలోనే రోడ్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిడదవోలు నియోజకవర్గంలో రోడ్లన్నీ అధ్వాన్న స్థితికి చేరుకున్నాయని, వాహనదారులకు రహదారులు నరకానికి మార్గాలుగా మారాయన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న రోడ్లకు పరిష్కార మార్గం చూపిస్తున్నామన్నారు.

పెరవలి నుండి నిడదవోలు వెళ్లే రహదారిపై గుంతల పూడ్చివేత కార్యక్రమం చేపట్టినప్పటికీ కొంత డ్యామేజ్ జరిగిందని, మళ్లీ ఈ రహదారిని ప్రాధాన్యత క్రమంలో తీసుకొని త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలని ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ ను ఆదేశించానన్నారు. దీపావళి పండుగ అనంతరం వర్షాలు ముగిసిన వెంటనే రోడ్డు మరమ్మతు ప్రక్రియను చేపడతామని వారు తెలిపినట్లు మంత్రి దుర్గేష్ వివరించారు.వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. ఇదే రహదారిలో మధ్యలో కొంత దూరం బాగోలేకపోతే రూ. కోటితో సిమెంట్ రోడ్డు వేయిస్తున్నామన్నారు.ధాన్యం సేకరణ అంశంపై పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో పాఠశాలల్లో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. డిప్యూటీ సీఎం సూచనల మేరకు సీఎం చంద్రబాబునాయుడు డొక్కా సీతమ్మ పేరును మధ్యాహ్న భోజన పథకానికి అంగీకరించినట్లు మంత్రి దుర్గేష్ గుర్తు చేశారు. ఈ ఏడాది నుండి సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామన్నారు.కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయన్న మంత్రి దుర్గేష్ ఆయా పథకాల తీరును, ప్రజలకు ఒనగూరుతున్న లబ్ధిని వివరించారు. గత ప్రభుత్వం ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి వెళ్లినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన విజన్ తో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.మంత్రి కందుల దుర్గేష్ కృషితో నిడదవోలు నియోజకవర్గంలో అనేక రోడ్లు అందమైనరహదారులుగా మారుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో డి.సి.ఎం.ఎస్ చైర్మన్ భూపతి రాజు రవి వర్మ, సర్పంచ్ బండారు వెంకటరమణ సాయిబాబా, ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ డిఈఈ పి. శ్రీనివాస్, జేఈ ఎంఎం ఆల్ ఫ్టీ న్, కే. ప్రసాద్, ఎమ్మార్వో నిరంజన్, ఎంపీడిఓ కె.వి.ఆర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా సాంస్కృతిక సంబరాలు.



తిరుపతి జిల్లా,చంద్రగిరి, యర్రావారిపాలెం అక్టోబర్18(వుదయం ప్రతినిధి): మండలంలోని బోడెవాండ్లపల్లిలో భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో డప్పు కళాకారుల సాంస్కృతిక సంబరాలు దళిత డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వందలాదిగా డప్పు కళాకారులు ర్యాలీ గా వేదిక వద్దకు చేరుకున్నారు.ఈసంధర్భంగా కుమార్ రెడ్డి,పెద్దలు మాట్లడుతూ గ్రామీణ కళలను పునరుద్ధరించడానికి నైతిక విలువలు పెంచడానికి ఈ సాంస్కృతిక ఉత్సవాలు ఎంతో తోడ్పడతాయని అన్నారు. కూటమి నాయకులు మాట్లడుతూ డప్పు కళాకారులు అభివృద్ధి చెందడానికి ప్రభుత్వపరంగా తగిన ప్రాధాన్యత పెన్షన్ వాయిద్య పరికరాలు ఇప్పించడానికి స్థానిక ఎమ్మెల్యే తో చర్చించి తగిన కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.